క్లుప్తంగా

నేడు అమావాస్య అన్నప్రసాద వితరణ

మోతీనగర్: జై ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అమావాస్య అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు మోతీనగర్ చౌరస్తా, సంతోష్ నిలయం వద్ద కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు

మూసాపేట: మూసాపేటలోని వార్డు కార్యాలయం సమీపంలో ఉన్న రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సప్పిడి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం బాలా త్రిపుర సుందరి దేవి, మంగళవారం గాయత్రి దేవిగా, బుధవారం వనదేవతగా, గురువారం అన్నపూర్ణా దేవిగా, శుక్రవారం మహాలక్ష్మీగా, శనివారం లలితాదేవిగా, ఆదివారం కాత్యాయని దేవిగా, సోమవారం సరస్వతి దేవిగా, మంగళవారం దుర్గాదేవిగా, బుధవారం మహిషాసురమర్ధినిగా, గురువారం శాంతాదేవి అమ్మవారుగా దర్శనమివ్వనున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మహిళలచే సామూహిక కుంకుమార్చన, 29న చిన్నారులకు అక్షరాభ్యాసం, అక్టోబర్ 1న చండీహోమం, 2న శమీ పూజ నిర్వహించన్నట్లు ఆయన తెలిపారు.

డ్రోన్‌లు, రోబోటిక్స్ టెక్నాలజీపై వర్క్‌షాపు

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఈడీసీ సెల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో శనివారం డ్రోన్‌లు, రోబోటిక్స్ టెక్నాలజీపై వర్క్‌షాపు నిర్వహించారు. వ్యవసాయం, నిఘా, మైనింగ్, లాజిస్టిక్ రంగాలలో టెక్నాలజీలో తాజా పురోగతులపై విద్యార్థులకు పరిచయం చేసింది. కార్యక్రమంలో ఈడీసీ సెల్ డాక్టర్ కె. నాగ సుజాత, ఎక్స్ డైమెన్షన్ రోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్, వీసీ టి. కిషన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పనుల పరిశీలన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధి జనప్రియనగర్‌లో శనివారం కార్పొరేటర్ సబిహా బేగం, జలమండలి అధికారులు అన్వేత్‌తో కలిసి వాటర్ సప్‌లై ఇంప్రూవ్‌మెంట్ కోసం జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయానికి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి సరఫరా మెరుగుపరచడం కోసం ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. కార్యక్రమంలో కె. శ్రీనివాసరెడ్డి, శ్యాం సుందర్ రెడ్డి, గోపాల్ నాయక్, రామారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలతో తాగునీరు వృథా!

- లీకేజీ ప్రాంతంలో నీరు కలుషితం
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీల ప్రజలు


పీజేఆర్ నగర్‌లో వాటర్ ట్యాంక్ వద్ద ..

లీకేజీలతో తాగునీరు వృథాగా పోతున్నాయి. దీనికి తోడు లీకేజీ అయిన ప్రాంతంలో కలుషిత నీరు చేరి కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. గత్యంతరం లేక ఆ నీటినే వేడి చేసుకుని తాగాల్సి వస్తున్నదని కూకట్‌పల్లి సర్కిల్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీలు కొన్ని నెలలు గడుస్తున్నప్పటికీ ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపటం లేదని వివిధ కాలనీలు, బస్తీల ప్రజలు ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – ఆల్విన్‌కాలనీ

కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ, వివేకానంద నగర్, కూకట్‌పల్లి, హైదర్‌నగర్ డివిజన్‌ల పరిధిలోని పలు కాలనీలలోని ప్రధాన రహదారులలో తాగునీటి ప్రధాన పైపులైన్ వాల్వ్‌లు లీకేజీ అయ్యాయి. నీరు ఏరులై పారుతున్నాయి. గాలన్ల కొద్దీ తాగునీరు రోడ్డు పాలు కావటంతో వాటిలో చెత్తా చెదారం చేరి దుర్గంధంతో కూడిన దుర్వాసన వస్తుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్, ఎన్‌టీఆర్ నగర్ మధ్య గల వాటర్ ట్యాంక్ వద్ద రెండు ప్రధాన మంచినీటి పైపులైన్ వాల్వ్‌లు లీకేజీలు అయ్యాయి. ఆస్‌బెస్టాస్ కాలనీ ప్రధాన రహదారిలోని సమ్మక్క, సారక్క దేవాలయం వద్ద రెండు తాగునీటి పైపులైన్ల లీకేజీతో మురుగునీరు చేరి కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. జగద్గిరిగుట్ట పైపులైన్ రోడ్డులోని ఆల్విన్ కాలనీ, ఎస్ఎస్‌డీ స్కూల్ సమీపంలోని బ్రిడ్జి వద్ద ప్రధాన పైపులైన్ లీకేజీ అయి తాగునీరు కాలువలో వృథాగా పోతున్నాయి. ఇలా అనేక ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్ లీకేజీలతో, కలుషిత జలాల సరఫరాతో అన్ని కాలనీ, బస్తీలలోని ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని స్థానిక సంక్షేమ సంఘం సభ్యులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్ వాల్వ్‌లకు మరమ్మత్తులు చేపట్టాలని పలువురు వేడుకుంటున్నారు.


ఎన్‌టీఆర్ నగర్‌లో లీకేజీ అవుతున్న మంచినీటి ప్రధాన పైపులైన్ వాల్వ్


ఆస్‌బెస్టాస్ కాలనీలోని ప్రధాన రహదారిలో మంచినీటి వాల్వ్ లీకేజీ

డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తి చేయాలి

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: దెబ్బతిన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పునరుద్ధరణ పనులు వెంటనే ప్రారంభించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని గోవింద్ హోటల్ చౌరస్తాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పగిలిపోవటంతో జలమండలి అధికారులతో శనివారం పైపులైన్ పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టారు. పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా సంవత్సరాల క్రితం వేసిన పాత పైపులు కావటం వల్ల పగిలిపోవటం జరిగిందన్నారు. ఇటువంటి సమస్య తిరిగి పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జలమండలి, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ విభాగం అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం హరికృష్ణ, డీజీఎం నాగప్రియ, మేనేజర్ ప్రియాంక, జీహెచ్ఎంసీ ఏఈ శ్రావణి, నాయకులు ఎండీ ఇబ్రహీం, శివరాజ్‌గౌడ్, పోశెట్టి గౌడ్, గోపాల్, లింగం, సుధాకర్, సత్తయ్య, రాజిరెడ్డి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎంపీ ఈటల రాజేందర్


శ్రీసాయి సాగర్ ఎన్‌క్లేవ్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ ఈటల రాజేందర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ తెలంగాణ రుచుల నుంచి మానస సరోవర్ హైట్స్, శ్రీసాయి సాగర్ ఎన్‌క్లేవ్‌లో పర్యటించారు. చెత్త డంపింగ్ వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వర్షపు నీరు నిలిచి ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటుందని, స్థానికంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డివిజన్‌లో డ్రైనేజీ నిర్మాణం కోసం రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయయని తెలిపారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో అభివృద్ధి పనుల కోసం రూ. 5.50 కోట్ల నిధులు మంజూరు చేసేందుకు వివిధ విభాగాల అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి, చంద్ర శేఖర్‌యాదవ్, మాణిక్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, సుజాత, శేఖర్, హర్జీత్‌సింగ్, అజయ్, కపిల్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు భార్గవ్ పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్ శ్రీకాంత్‌ను అభినందించిన పోలీస్ కమిషనర్



మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన రేణు అగర్వాల్ హత్య కేసులో విలువైన సమాచారం అందించిన క్యాబ్ డ్రైవర్ శ్రీకాంత్‌ని సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి శనివారం అభినందించారు. క్యాష్ రివార్డ్‌ని అందజేశారు. కేసు దర్యాప్తులో కీలకపాత్ర పోషించిన శ్రీకాంత్ ధైర్యసాహసాలను ప్రశంసించారు. పోలీస్ సిబ్బందిని కూడా ప్రత్యేకంగా అభినందించారు.

కార్పొరేటర్‌కు ఎమ్మార్పీఎస్ వినతి

ఓల్డ్ బోయిన్‌పల్లి: దివ్యాంగులకు రూ. 6 వేల పింఛన్ పెంచాలని, వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, నేత, గీత కార్మికులతో పాటు ఇతర పెన్షన్ రూ.4 వేలు పెంచాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వీహెచ్‌పీఎస్, సీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి మంద మధుకర్, ఉపాధ్యక్షులు బ్యాగరి నర్సింహ ఆధ్వర్యంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. పింఛన్ పెంచేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భూమయ్య, రాజు, యాదగిరి, మక్కాల అశోక్, శ్రీను, నరేష్, పండు, రాజు, కార్తీక్, నాని తదితరులు పాల్గొన్నారు.



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ



బాలానగర్: మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని నాయకులు అన్నారు. డ్రగ్స్‌కు బానిసలుగా మారి అమూల్యమైన జీవితం కోల్పోవద్దని సూచిస్తూ శనివారం బాలానగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వందలాది విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీ బాలానగర్ బీజేపీ పార్టీ అధ్యక్షులు డా. కిరణ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో స్మార్ట్ హ్యాకథాన్

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్‌లో శనివారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025 కోసం ఇంటర్నల్ హ్యాకథాన్ నిర్వహించారు. 76 బృందాలు, 456 మంది విద్యార్థులతో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌పై 212 జాతీయ స్థాయి సమస్యలపై తమ పరిష్కారాలను రూపొందించి, 8 మంది నిపుణుల జ్యూరీ ప్యానెళ్ల ముందు ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ హేమలత, డాక్టర్ శరత్ బాబు, ప్రొఫెసర్లు విజయకుమారి, కవిత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బతుకమ్మ సంబురం

పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు


బతుకమ్మతో చిన్నారి


కూకట్‌పల్లిలోని హనుమాన్ దేవాలయం వద్ద..


మూసాపేటలో జరిగిన బతుకమ్మ సంబరాల్లో విద్యార్థినులు


ఆల్విన్‌కాలనీలోని శ్రీసరస్వతి శిశు మందిర్‌లో..




వివేకానందనగర్: బతుకమ్మతో యువతి


కూకట్‌పల్లిలో పెద్ద ఎత్తున్న పాల్గొన్న మహిళలు



ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా మహిళలు పెద్ద ఎత్తున సాంప్రదాయ దుస్తులను ధరించి బతుకమ్మలను హనుమాన్ చౌరస్తా వద్దకు తీసుకొచ్చారు. తమ ఆటపాటలతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకే ప్రారంభమైన ఈ వేడుకలకు కూకట్‌పల్లి ప్రాంత ఆడపడుచులు, మహిళలు విదేశాల నుంచి సైతం ఇక్కడికి వచ్చి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఎంతో విశేషం. పూలతోని పేర్చిన బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ఇక్కడి మహిళలకు సాంప్రదాయపు అలవాటు. హనుమాన్ చౌరస్తా వద్ద 7 గంటల వరకు తమ ఆటా పాటలతో అలరించి అనంతరం రంగధాముని చెరువులో బతుకమ్మలను గంగమ్మ ఒడికి చేర్చారు. – కూకట్‌పల్లి


బతుకమ్మతో యువతి


కూకట్‌పల్లిలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో..


కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..


మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో..

తల్లిదండ్రులు దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య మాట్లాడుతూ.. విద్యార్థులను కళాశాలకు క్రమం తప్పకుండా పంపించాలని, సంబంధిత తరగతి ఇన్‌చార్జీలను కలిసి విద్యార్థుల చదువులో ఏ విధంగా ఉన్నారో తెలుసుకోవాలన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలపై దృష్టి సారించాలన్నారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. సమావేశంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.